సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



సహకార సేవల విస్తరణ

హైదరాబాద్(రంగారెడ్డి) జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తన సేవలు విస్తరించేందుకు సంకల్పించింది. 8లో▸



ఓటుతో ఆశీర్వదించండి

బీజేపీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను ఓటుతో ఆశీర్వదించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. 8లో▸



ఓటుతో బుద్ధి చెబుదాం

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

4,133 మెగావాట్లు

గ్రేటర్ విద్యుత్ డిమాండ్



సాక్షి, రంగారెడ్డి జిల్లా : భగ్గున మండుతున్న ఎండలకు తోడు గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ కూడా అదే స్థాయిలో నమోదవుతోంది. సోమవారం గరిష్ఠ డిమాండ్ 4,133 మెగావాట్లకు చేరింది. 2023 ఏప్రిల్ 29న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 3,109 మెగావాట్లు నమోదు కాగా, తాజాగా 32.93 శాతం అదనపు డిమాండ్ నమోదైంది. ఆదివారం సెలవు రోజు కూడా 83.04 మిలియన్ యూనిట్లు రికార్డు అయింది. గతేడాది ఏప్రిల్ 30న (ఆదివారం) 54.09 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, తాజాగా 53.52 శాతం పెరుగుదల కన్పించింది.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి నీరజాగాంధీ



ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న నీరజాగాంధీ తదితరులు

యాచారం: ఆయిల్‌పాంతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, రైతులు సాగుపై దృష్టి సారించాలని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి నీరజాగాంధీ సూచించారు. మండల పరిధిలోని మాల్,చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో సోమవారం ఆయిల్‌పాం తోటలను ఆమె పరిశీలించారు. వేసవిలో పంట సాగులో తీసుకోవాల్సినజాగ్రత్తలపై రైతులకు సూచనలు చేశారు.సాగులో ఏవైనా ఇబ్బందులుంటే స్థానికంగా ఉండే ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారులు సంజయ్‌కుమార్, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి


కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న పినపాక ప్రభాకర్

షాద్‌నగర్: మేడే స్ఫూర్తితో కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కార్మిక సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్మిక వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. అనేక రంగాల్లో కార్మికులు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని అన్నారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నా, వారికి పీఎఫ్‌లు, రక్షణ కవచాలు అందించకున్నా ఆ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు సుధాకర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, కుమార్, భాస్కర్, రాజేష్, రేణుకుమార్, సలీం, గిరి తదితరులు పాల్గొన్నారు.

సమరమే..



ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ

- విత్‌డ్రా చేసుకుంది ముగ్గురు మాత్రమే..
- బరిలో 43 మంది అభ్యర్థులు
- నేటి నుంచి ప్రచారం ముమ్మరం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు ముగ్గురు అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి బరిలో 43 మంది ఉన్నారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారిలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సత్వంత్ర అభ్యర్థులు మహ్మద్ చాంద్‌పాషా, దూదేకుల ఇమామ్ హుస్సేన్ ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 22 మంది గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన వారు కాగా, మరో 21 మంది స్వతంత్రులు ఉన్నారు. ఈ నెల 18 నుంచి 25 వరకు చేపట్టిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా మొత్తం 64 మంది 88 నామినేషన్లు దాఖలు చేశారు. అసంపూర్తిగా ఉన్న నామినేషన్లతో పాటు అఫిడవిట్లు సమర్పించని 18 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 46 మంది పోటీకి అర్హత పొందారు. ముగ్గురు తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా, మిగిలిన వారంతా పోటీలో ఉన్నారు.

బరిలో నిలిచింది వీరే..

కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్), కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బీజేపీ), గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), పి.గోవింద్ (బహుజన్ ముక్తి పార్టీ), చింతలగారి వెంకటస్వామి (బ్లూ ఇండియా పార్టీ), తొట్ల రాఘవేందర్ ముదిరాజ్(ధర్మ సమాజ్ పార్టీ), దుర్గాప్రసాద్ (ప్రజా వెలుగు పార్టీ), నరసింహారెడ్డి దేవ (తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), పాలమాకుల మధు(ఇండియా ప్రజాబంధు పార్టీ), ఫణి ప్రసాద్ కటకం (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), మహ్మద్ అబ్దుల్ ఖావి అబ్బాసి (ఆల్ ఇండియా మజ్లిస్-ఇ- ఇంకిలాబ్-ఇ-మిల్లత్), మహ్మద్ సలీం (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్-సెక్యులర్), మహ్మద్ షకీల్ (దేశ్ జనహిత్ పార్టీ), బీవీ రమేష్ నాయుడు (సోషలిస్ట్ పార్టీ-ఇండియా), రాములు బింగి(యుగ తులసి పార్టీ), రంజిత్‌రెడ్డి గాదె (రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ), శ్రీదేవి ఎం (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), సానెం రాజుగౌడ్ (ప్రజా ఏక్తా పార్టీ), సుగురు శ్రీనివాస్ (జై స్వరాజ్ పార్టీ), సుధాకర్ వనం (మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా-యునైటెడ్), సేరుబాయి వసంతకుమార్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ) అభ్యర్థులు పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా అమీర్‌సాజిత్, అంకగాల ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు సీరటి, ఈసరి సూర్యప్రకాష్‌రెడ్డి, కత్తుల యాదయ్య, కావలి సుకుమార్, కండికేకర్ శ్రీనివాస్, గోనె శ్రీనివాసరెడ్డి, గోవింద్‌లాల్, జనపాల దుర్గా ప్రసాద్, జలీల్ అహ్మద్, వి.పాండు, జి.మల్లేష్ గౌడ్, మహ్మద్ ఇక్బాల్, మహ్మద్ అఫ్సర్ ఖుద్దూస్, మహ్మద్ అలీ, మహ్మద్ పాషా, మమ్మద్ ముస్తఫా రిజ్వాన్, మహ్మద్ రియజుర్ రెహమాన్ షేక్, విశ్వకర్మ సప్తగిరి, సాహితి దాసరి బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 11 మంది ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటం గమనార్హం.

సీవిజిల్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ యాప్ ద్వారా 108 ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ఎవరైనా యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసి ఫొటో లేదా వీడియో తీసి సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సివిజిల్ యాప్ సురక్షితమైందని, దీనిని ఆపరేటింగ్ చేయడం చాలా సులువన్నారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పంపించొచ్చని సూచించారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ 1950

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేయడం జరుగుతుందన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి

తుర్కయంజాల్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. తుర్కయంజాల్‌లో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మల్లేశ్‌కు ప్రజల సమస్యలు తెలుసని, ఆయనకు ఓటు వేసి గెలిపిస్తే లోక్‌సభలో మన గళం వినిపిస్తాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో తప్పుడు హామీలిచ్చి, మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మొదటి 100 రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని వాగ్దానం చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. మతం, దేవుడి పేరుతో రాజకీయాలు చేసే బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆరోపించారు. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. బ్రాహ్మణపల్లి చౌరస్తా నుంచి తుర్కయంజాల్ వరకు నిర్వహించిన రోడ్‌షోలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, చెవుల దశరథ, నాయకులు బద్దం వెంకట్‌రెడ్డి, చెవుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

ఓట్ల కోసం మత రాజకీయాలు

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

షాద్‌నగర్: ఓట్ల కోసం బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏక కాలంలో నియోజకవర్గవ్యాప్తంగా ప్రచారానికి సంబంధించిన వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేయకుండా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు రాచరిక పాలన కొనసాగించి బీఆర్ఎస్ నేతలు ప్రజాధనం దోచుకున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో ఎక్కడా లేని విధంగా వినూత్న రీతిలో ఇంటింటి ప్రచారం షాద్‌నగర్‌లో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు అశ్లేషారెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, యాదయ్య యాదవ్, బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య పాల్గొన్నారు.

పేదలే లేరనడం హాస్యాస్పదం

- దేవుడి పేరుతో బీజేపీ రాజకీయం
- గ్యారంటీలన్నీ అమలు చేస్తాం
- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్: దేశంలో పేదరికమే లేదంట.. బీజేపీ ఉచిత పథకాలు వద్దంటోందని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్, పెద్దమంగళారం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం అంజనీదేవి గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కోట్ల మంది పేదలు ఉన్నారని.. వారందరికీ సంక్షేమ పథకాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మాత్రం దేశంలో పేదలే లేరని.. ఉచిత హామీలు ఇవ్వదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డికి సొంతంగా ఓట్లు అడిగే దమ్ములేదని.. ప్రధాని మోదీ, రాముడి పేరు చెప్పి అభ్యర్థిస్తున్నారని విమర్శించారు. రాముడు అందరికీ దేవుడని.. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుక్కునే దౌర్భాగ్య స్థితిలో బీజేపీ ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. మిగిలిన పథకాలన్నీ ఎన్నికల తరువాత అందరికీ అందుతాయన్నారు. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. పనిచేసే కార్యకర్తలకు త్వరలోనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి జ్యోత్స్న, సమన్వయకర్తలు సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్, టీపీసీసీ సభ్యుడు దర్శన్, సీనియర్ నాయకుడు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, అర్చన, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు నేను గ్యారంటీ

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు తాను గ్యారంటీ అని.. కనకమామిడి దత్తాత్రేయ స్వామి సాక్షిగా చెబుతున్నానని పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్ నగర్, హిమాయత్‌నగర్, కనకమామిడిలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను చేవెళ్ల నియోజకవర్గంలో అమలు చేసే గ్యారంటీ తనదని స్పష్టం చేశారు. అభివృద్ధి గురించి కాకుండా బీజేపీ నాయకులు మతం, కులం ప్రాతిపదికన ప్రజలను వేరు చేసి ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు దర్శన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తమ్మలి మాణయ్య తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తనిఖీల్లో రూ.49 లక్షలు సీజ్

కొత్తూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు నిరంతరం వాహనాల తనిఖీ చేపడుతున్నారు. కొత్తూరు సోమవారం పారిశ్రామికవాడ వద్ద ఓ వాహనంలో రూ.34లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం బ్యాంకులకు నగదు సరఫరా చేసే వాహనాన్ని తనిఖీ చేయగా రూ.34లక్షలు గుర్తించారు. కొత్తూరు ఎస్‌బీఐ నుంచి వికారాబాద్‌కు తరలిస్తున్నట్లు వారు పోలీసులకు వివరించారు. సిబ్బంది వద్ద ఉన్న రశీదులో వాహనం నంబర్, బ్యాంకు అధికారుల వద్ద తీసుకున్న రశీదులో వాహనం నంబర్ వేరుగా ఉన్నట్లు గుర్తించారు. నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్‌సెల్‌కు తరలించారు.

కొల్లూరు బస్‌స్టేజీ వద్ద..

చేవెళ్ల: వాహనాల తనిఖీల్లో ఓ కారులో తీసుకెళ్తున్న రూ.15లక్షల నగదును పోలీస్‌లు సీజ్ చేశారు. సోమవారం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్లూరు బస్‌స్టేజీ వద్ద చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.15లక్షల నగదు పోలీసులు పట్టుకున్నారు. విచారించగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామన్నారు. పోలీసులు నగదును, కారును స్వాధీనం చేసుకుని మోకిల పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

100% లక్ష్యంగా..

- లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌పై ప్రత్యేక దృష్టి
- విస్తృత ప్రచారం చేస్తున్న అధికారులు
- నేటికీ కొందరు ఓటింగ్‌కు దూరం

పరిగి: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. ఈ అవకాశాన్ని చాలామంది వినియోగించుకోవడం లేదు. భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కొందరు విస్మరించడంపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓట్ల పండుగలో పాల్గొనేలా చర్యలు చేపట్టింది. ఎన్నికలు జరిగిన ప్రతి సారీ ప్రతి ఒక్కరూ ఓటువేయాలని సూచిస్తోంది. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ప్రధానంగా స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అధికారులతో స్వీప్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా విద్యాసంస్థల్లో ప్రచారం చేయిస్తున్నారు. అవగాహన ర్యాలీలు, 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కొత్త ఓటర్లు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, కార్మికులు, వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనేలా చొరవ తీసుకుంటున్నారు.

ఓటు వేస్తేనే భవిష్యత్

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు వేస్తేనే దేశ భవిష్యత్ మారుతుందని అధికారులు, మేధావులు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అమూల్యమైన ఓటుకు ఏ ఒక్కరూ దూరంగా ఉండొద్దని అవగాహన కల్పిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచడంలో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఇళ్ల వద్దే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నారు. ఓటు వేయడం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవచ్చని, తద్వారా తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. చదువుకున్న వారు ఓటింగ్‌లో పాల్గొని ప్రజలకు సేవ చేసే నాయకున్ని ఎన్నుకోవాలని కోరుతున్నారు.



ఓటుహక్కు వినియోగంపై 5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

పట్టణాల్లోనే వెనుకబాటు

పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది. ఇలాంటి ప్రాంతాలను గుర్తించిన అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం బాగానే ఉన్నా పట్టణ కేంద్రాల్లో తక్కువగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం, వేరే ప్రాంతాల్లో నివాసం ఏర్పర్చుకోవడం, ఉద్యోగ, ఉపాధి పనుల్లో ఉండి తీరిక లేకపోవడం వంటి కారణాలతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారుల పరిశీలనలో తేలింది. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంపై అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి చైతన్యం చేస్తున్నారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

భరత్‌ప్రసాద్‌ను ఆశీర్వదించండి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

తలకొండపల్లి/కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను ఓటుతో ఆశీర్వదించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. సోమవారం ఆయన తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి, రాంపూర్, మెదక్‌పల్లి, చంద్రధన, తలకొండపల్లి, పడకల్, కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్, న్యామతాపూర్, మక్తమాధారం, మైసిగండి, కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 400 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం.. మోదీ మూడోసారి ప్రధాని అవ్వడం ఖాయమన్నారు. భరత్‌ప్రసాద్ గెలుపుకోసం కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయ ఢంకా మోగించాలన్నారు.

అందుబాటులో ఉంటా: భరత్ ప్రసాద్

అనంతరం భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. తనను పార్లమెంట్‌కు పంపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తానన్నారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ సర్కార్‌తో రాష్ట్రం పదేళ్ల వెనుకకు నెట్టివేయబడిందని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మోదీతోనే సాధ్యమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, హైదరాబాద్–శ్రీశైలం హైవేను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ప్రచారంలో బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, భగీరథ్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, మండల అధ్యక్షుడు రవిగౌడ్, జిల్లా నాయకులు పాండుప్రసాద్,శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి, ఎంపీటీసీ సభ్యుడు హేమరాజు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి పాండు, డాక్టర్ ప్రసాద్, మహేశ్, సాయిప్రభు, రాందాస్‌నాయక్, బ్రహ్మచారి, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రెడ్యా, బాలకృష్ణ, వెంకటేశ్, పవన్‌రెడ్డి, చందన్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆచారి, చిత్రంలో భరత్‌ప్రసాద్, నర్సింహారెడ్డి

సహకార సేవల విస్తరణ



హెచ్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయం



మాల్‌లో భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

- ఉమ్మడి జిల్లాలో మరో ఐదు శాఖలు
- జూన్‌లోగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- మాల్‌లో శాశ్వత భవన నిర్మాణానికి నిధుల మంజూరు

యాచారం: హైదరాబాద్(రంగారెడ్డి) జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తన సేవలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు సంకల్పించింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 బ్రాంచ్‌లలో లక్షా డెబ్బై ఐదు వేల మందికి పైగా ఖాతాదారులకు సేవలందిస్తోంది. లక్ష మందికి పైగా రూ.1,750 కోట్లకు పైగా రుణాలు ఇచ్చింది. ప్రభుత్వ, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులను పెంచుకుని విరివిగా రుణాలు ఇస్తూ.. వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తూ తమ బ్యాంకుల సేవలను మరింత విస్తరించుకునేందుకు హెచ్‌డీసీసీబీ దృష్టి సారించింది. అందులో భాగంగానే దీర్ఘకాలిక, స్వల్పకాలిక, వ్యవసాయ రుణాలతో పాటు బంగారు తాకట్టు, గృహ నిర్మాణాలకు, విదేశీవిద్యకు, చిరు వ్యాపారులకు రుణాలను అందిస్తోంది. ఎస్‌బీఐ, యూనియన్ తదితర బ్యాంకుల్లో కేవలం ఆర్థిక పరులకే సేవలు అందుతాయనే అపవాదు ఉంది. రైతులకు, నిరుపేదలకు విరివిగా రుణాలు ఇచ్చి దగ్గర చేసుకునేందుకు హెచ్‌డీసీసీబీ ప్రణాళికలు చేసింది. అందులో భాగంగా హెచ్‌డీసీసీబీ సేవలను మరింత విస్తరించేందుకు గాను ఆ సంస్థ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, సిబ్బంది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మారుమూల పల్లెల్లోనూ పీఏసీఎస్‌ల ద్వారా హెచ్‌డీసీసీబీ రుణాలు అందిస్తోంది.

కొత్తగా ఐదు బ్రాంచ్‌లు

ఉమ్మడి జిల్లాలో హెచ్‌డీసీసీబీ సేవల విస్తరణలో భాగంగా మరో ఐదు నూతన బ్రాంచ్‌లను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే 30 హెచ్‌డీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయి. కొత్తగా ఉమ్మడి జిల్లాలో మాల్, నానక్‌రాంగూడ (రంగారెడ్డి జిల్లా), లక్ష్మీనారాయణపూర్, మన్నెగూడ(వికారాబాద్ జిల్లా), బోడుప్పల్(మేడ్చల్ జిల్లా)లో నూతన బ్రాంచ్‌లను ప్రారంభించనున్నారు. మాల్‌లో హెచ్‌డీసీసీబీకి సొంత స్థలం ఉండడంతో రూ.75 లక్షల నిధులతో త్వరలో శాశ్వత భవనాన్ని నిర్మించనున్నారు. రెండు రోజుల కింద డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో పాటు ఉన్నతాధికారులు మాల్‌లో స్థలాన్ని పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చైర్మన్ హెచ్‌డీసీసీబీ ఉన్నతాధికారులను ఆదేశించారు. లక్ష్మీనారాయణపూర్, మన్నెగూడ, నానక్‌రాంగూడ, బోడుప్పల్‌లో ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకుని బ్రాంచ్‌లను ప్రారంభించనున్నారు. వీటిని జూన్‌లోగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పంట రుణాలకు, పిల్లల ఉన్నత విద్యకు రైతులు తమ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి అప్పులు పొందే అవకాశం ఉంటుందని హెచ్‌డీసీసీబీ భావన.

రూ.10లక్షలకు పైగా దీర్ఘకాలిక రుణాలు

కొత్త బ్రాంచ్‌ల ప్రారంభోత్సవం తర్వాత ఖాతాదారులను మూడు లక్షలకు పెంచేందుకు హెడీసీసీబీ దృష్టి సారించింది. అందుకు 2024–25 ఏడాదికి గాను రూ.150 కోట్లకు పైగా దీర్ఘకాలిక రుణాలు, మరో రూ.వంద కోట్లకు పైగా వివిధ పద్ధతుల్లో ఖాతాదారులకు రుణాలిచ్చేందుకు చూస్తున్నారు. నాబార్డు నుంచి విరివిగా నిధులు మంజూరవుతున్న దృష్ట్యా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు హెచ్‌డీసీసీబీ చూ పౌల్ట్రీ, డెయిరీ, మేకల, గొర్రెల పెంపకానికి ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు హెచ్‌డీసీసీబీ దృష్టి పెట్టింది.

ఏళ్ల నుంచి కోరుతున్నాం



మాల్‌లో కొత్తగా హెచ్‌డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభించాలని కొన్నేళ్లుగా ఉన్నతాధికారులను కోరుతున్నాం. యాచారం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, కేసీతండా, మాల్ తదితర గ్రామాల నుంచి యాచారం హెచ్‌డీసీసీబీకి వెళ్లడం రైతులకు ఇబ్బందిగా మారింది. నేడు కొత్త బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉంది.

– కారింగ్ యాదయ్యగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్

రైతుల ఇబ్బందికి చెక్



ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల్లో రైతులకు సరైన సేవలు అందడం లేదు. కొన్ని సార్లు బ్యాంకు సిబ్బంది అత్యవసర సమయాల్లో ఏ రుణాలు రైతులకు ఇవ్వడం లేదు. పట్టాదారు, పాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్ల పత్రాలు పెట్టిన రుణాలు ఇవ్వాలంటే చెప్పులరిగేలా తిప్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా హెచ్‌డీసీసీబీ కొత్త బ్రాంచ్‌లను ప్రారంభించడం సంతోషకరం.

– దెంది రాంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నేత

ప్రస్తుతం అద్దెభవనాల్లో..



ఉమ్మడి జిల్లాలో ఐదు కొత్త హెచ్‌డీసీసీబీ బ్రాంచులను ప్రారంభిస్తున్నాం. జూన్ లోపే ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం అద్దె భవనాల్లో బ్రాంచ్‌లను ప్రారంభిస్తాం. అధికంగా ఖాతాదారులను పెంచుకోవడం, అడిగినన్ని రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మూడు లక్షలకు పైగా ఖాతాదారులను పెంచి రూ.2,500 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు చేసేందుకు నిర్ణయించాం.

– కొత్తకుర్మ సత్తయ్య, చైర్మన్, హెచ్‌డీసీసీబీ

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుదాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని, నేటికి అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, మంగళిగూడ, కొనాయపల్లి గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశ భవిష్యత్ బాగుంటుందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి డీకే అరుణను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్, పసుల నర్సింహయాదవ్, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి

వృద్ధుడి అదృశ్యం



సాదక్ అలీ (ఫైల్)

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరి ధిలో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు సోమ వారం తెలిపిన ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన కుసుంబీ, సాదక్ అలీ(67) దంపతులు జీవనోపాధి నిమిత్తం 12 ఏళ్ల క్రితం ఉప్పర్‌పల్లికి వలస వచ్చారు. పది రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా జల్‌పల్లికి వచ్చారు. ఈ నెల 25న దంపతులు షాపింగ్ చేసుకుని కుసుంబీ బస్సు ఎక్కి వెళ్లగా సాదక్ అలీ ఎక్కలేదు. వెనుక బస్సులో వస్తాడని భావించినప్పటికీ ఇంటికి వెళ్లలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న సాదక్ అలీ గతంలోనూ ఇలాగే తప్పిపోయి తిరిగి వచ్చాడు. ఈ సారి ఎంతకి రాకపోవడంతో ఆయన కుమారుడు అస్లాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

రూ.25వేల జరిమానా

మంచాల: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. మంచాల సీఐ బాబ్యునాయక్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద బాల నరసింహ(43) 2016లో తన బంధువు ఇంటికి వచ్చి మానసిక స్థితి సరిగా లేని బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి సీఐ గంగాధర్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం పోక్సో చట్టం ప్రకారం తొమ్మిదవ అదనపు కోర్టు నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధించింది. అదేవిధంగా బాధితురాలికి రూ.10లక్షల ఆర్థికసాయం ప్రకటించింది. నిందితుడికి శిక్ష పడేందుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోమలత, సీడీఓ (కోర్టు డ్యూటీ ఆఫీసర్)రాజేశ్వరి కృషి చేశారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

తలకొండపల్లి: నగరంలో ని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండల పరిధిలోని జూలపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన ప్రకారం.. గ్రామానికి చెందిన జశ్వంత్(12) ఆదివారం ఆటోలో గ్రామశివారులోని సంపులో ఈత కొట్టేందుకు బయలుదేరాడు. సంపు కొంచెం దూరంలో ఉండగానే ఆటో దిగే క్రమంలో రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాలుడు సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి నక్క సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు.



జశ్వంత్ మృతదేహం

తుంటి ఎముక సర్జరీ సక్సెస్

పీఎంఆర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీతో ఉచిత ఆపరేషన్లు

- సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి జనరల్ ఆస్పత్రిలో తుంటిఎముక ఆపరేషన్ విజయవంతం అయిందని ఆస్పత్రి సూపరింటెండెంట్, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. . ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు పీఎంఆర్ ఆస్పత్రిలో ఒక్కొక్కటిగా అన్ని ఆపరేషన్లు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఇటీవలే 55 ఏళ్ల మహిళకు చేసిన తుంటి ఎముక ఆపరేషన్ విజయవంతమై కోలుకుంటుందన్నారు. డాక్టర్ విక్రాంత్, డాక్టర్ వంశీరావరిన్య, డాక్టర్ చంద్రశేఖర్ బృందం ఆపరేషన్లో పాల్గొన్నారని చెప్పారు. ఇటీవలే డాక్టర్ రాజేంద్రప్రసాద్ వైద్య బృందం రొమ్ముక్యాన్సర్ ఆపరేషన్, స్కిన్ క్యాన్సర్‌కు సంబంధించిన రొటేషన్ ఫ్లాప్ ఆపరేషన్‌ను డాక్టర్ హన్మంత్‌రావు వైద్యబృందం విజయవంతం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే ఆస్పత్రిలో 250 ఆపరేషన్లు చేశామన్నారు. పేదలు మెరుగైన వైద్య సేవలందిస్తామని.. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, పీఎంఆర్ కళాశాల డీన్ సత్యనారాయణ

ఓటమి నుంచి పాఠం నేర్చుకో

పరీక్ష ఫెయిలైనంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు

- విజయం వరించే వరకూ పోరాడు
- నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు


❑ రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడలో నివాసం ఉండే ఓ విద్యార్థిని ఎంపీసీ మొదటి సంవత్సరం ఒక సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదు. మనోవేదనకు గురైన బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.

❑ ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడని కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్ ఉరేసుకొని తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిలించాడు.

అనంతగిరి: చదువు కోసం చాలా ఖర్చు చేస్తున్నాం.. అధిక మార్కులు, ర్యాంకు రాకుంటే డబ్బులు వృథా అంటూ నేటితరం తల్లిదండ్రులు చాలామంది పిల్లలకు చెబుతున్నారు. మార్కులు, ర్యాంకుల వేటలో వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఇవే పిల్లల్ని మానసిన వేదనకు గురి చేస్తున్నాయి. చదువులో కొంత మేర ప్రతిభ ఉన్న విద్యార్థులే దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. చదువులో పూర్తిగా వెనుకబడిన వారు తల్లిదండ్రుల మాటల్ని పట్టించుకోవట్లేదు. మెజార్టీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల మోజుతో తప్పులు చేస్తున్నాయి. మార్కుల్లో వీరే ముందంజలో ఉన్నారంటూ రంగు రంగుల పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

వేగాన్ని అందుకోలేక..

గెలుపోటముల సుదీర్ఘ ప్రయాణమే మనిషి జీవితం. ఇందులో కల్మషం లేనిది బాల్యం. ఈ వయసులోని బాలబాలికలకు ఓటమిని తట్టుకునే శక్తి తక్కువ. చిన్న అంతరాలనే మోయలేని పసి మనసు వీరిది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువును ఆర్జించే విధానం పూర్తిగా మారిపోయింది. ర్యాంకులు, ఉత్తమశ్రేణి సంస్థల్లో సీట్లు అంటూ కొంతమంది తల్లిదండ్రులు, పలు ప్రైవేటు విద్యా సంస్థలు చిన్నారి హృదయాలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఆ వేగాన్ని అందుకోలేని పలువురు విద్యార్థులు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. పది తప్పామని.. ఇంటర్ ఫెయిలయ్యామని ఆత్మహత్యలకు పాల్పడుతూ కన్నవారికి గర్భశోకం మిగులుస్తున్నారు.



ప్రతిభకు సానబెట్టాలి

అమావాస్య తర్వాత పున్నమి కాంతులకు పక్షం రోజులు పట్టినట్లే.. ఓటమి నుంచి పాఠాలను నేర్చుకుంటే విజయం వరిస్తుందని యువత గ్రహించాలి. దేహానికి తప్ప దాహానికి పనికిరాని సముద్రపు కెరటాలు ఎగిసి పడుతుంటే ఇప్పుడు వచ్చిన కాస్త కష్టానికి తలవంచితే ఎలా? అన్న శ్రీశ్రీ మాటలను ఒక్కసారి మననం చేసుకోవాలి. చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే.. అంతేకానీ చదువే జీవితం కాదనేది గుర్తించాలి. ఉన్నత చదువులు లేని ఎంతో మంది జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారు మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. దాన్ని గుర్తించి సానబెడితే కోరుకున్న రంగంలో ఉన్నత స్థితికి చేరుకుంటారు. ప్రస్తుతం ఆయా రంగాల్లో విజేతలుగా చలామణీ అవుతున్న వారు సైతం మొదట్లో వైఫల్యాలను రుచి చూసిన వారేనని గుర్తించాలి.

చిన్న విషయాలకే పెద్ద నిర్ణయాలు

విదార్థులు చిన్న విషయాలకే పెద్ద నిర్ణయాలు తీసుకొని తల్లిదండ్రులను అనాథలు చేస్తున్నారు. అల్లా రు ముద్దుగా పెంచిన పిల్లలు చిన్నచిన్న కారణాలకే తనువు చాలించిన ఘటనలు కుటుంబ సభ్యుల్ని విషాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిలయ్యామనే కారణంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నేడు పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నా యి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మానసిక ధైర్యాన్ని అందించాలి. ఫలితాలను మార్చే అవకాశం కూడా లేనందున మళ్లీ మంచి మార్కులు సాధించే దిశగా వారిని ప్రోత్సహించాలి.

వీరు ఎందరికో ఆదర్శం

▲ క్రికెట్ దేవుడిగా పేరొందిన సచిన్ టెండూల్కర్ పదో తరగతిలో ఫెయిలయ్యారు. అలాగని తనకు ఇష్టమైన ఆటను మాత్రం అశ్రద్ధ చేయలేదు. ఎన్నో ప్రతికూలతలను తట్టుకుని.. లక్ష్యాన్ని చేరుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగారు. తన ప్రతిభతో అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచారు.

▲ విభిన్న పాత్రల్ని సులువుగా పోషించే సినీ నటుడు కమల్‌హాసన్ స్కూల్ డ్రాపౌట్. ఆయన పదో తరగతి కూడా చదవలేదు. అయితేనేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, చదవడంపై పట్టు సాధించారు. మల్టీ టాలెంటెడ్ స్టార్‌గా ఎదిగారు.

▲ స్వాతంత్య్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య హైస్కూల్ విద్యను సైతం పూర్తి చేయలేదు. అయినప్పటికీ బాల్యంలోనే పత్రికను నడిపారు. డిగ్రీ, పీజీ పట్టాలు లేకపోయినా తమ జీవితాల్లో అద్భుతాలు చేసిన వారెందరో మన చుట్టూనే ఉన్నారు. ఇలాంటి గొప్పవారి జీవితాలను ఒక్కసారి గమనించాలి.